అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

ఆదివారం 26 ఫిబ్రవరి 2023

టౌన్షిప్‌లో మౌలిక వసతులు కల్పించాలి

- పదిరోజుల్లో పూర్తిచేయాలని అధికారులకు కలెక్టర్‌కు ఆదేశం

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

పది రోజుల వ్యవధిలో అడ్లూరు శివారులోని ధరణి టౌన్షిప్ లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ధరణి టౌన్షిప్ లో మౌలిక వసతుల కల్పనపై అధికారులతో జిల్లా కలెక్టర్ శనివారం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సౌకర్యం, అంతర్గత రోడ్లు, రక్షణ గోడ నిర్మాణం పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. పనుల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, ధరణి టౌన్షిప్, మున్సిపల్, ఆర్ అండ్ బి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

శాంభవిలో వీడ్కోలు సంబరాలు

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండలంలోని శాంభవి హై స్కూల్‌లో పదవతరగతి విద్యార్థులకు వీడ్కోలు సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆట పాట లతో అందరినీ అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్ రాజ్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇంద్రాణి,ప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చాలి





బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి.. పాల్గొన్న కమిషనర్, వైస్ చైర్‌పర్సన్

కామారెడ్డి మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కామారెడ్డిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి మున్సిపల్ 2023-24 బడ్జెట్ సమావేశం శనివారం పట్టణంలోని కళాభారతిలో మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణ ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి బడ్జెట్ ను వినియోగించాలని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. పట్టణంలో నీటి ఎద్దడిని పరిష్కరించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు.

ఏప్రిల్ 1వ తేదీ నాటికి అంచనా ప్రారంభ నిలువ రూ.25.66 కోట్లుగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరం అంచనాల ఆదాయం రూ.48.58 కోట్లుగా రూపొందించారు. 2023-24 అంచనా సాధారణ వ్యయం రూ.48.58 కోట్లు కాగా, వచ్చే ఏడాది మార్చి 31వ నాటికి మిగులు బడ్జెట్ రూ.25.66 కోట్లుగా ఉందని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ చదివి వినిపించారు. కౌన్సిలర్లు చేతులెత్తి బడ్జెట్ కు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సమాజంలో అందరితో ట్రాన్స్‌జెండర్‌లు సమానమే

- జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్
- నైపుణ్య శిక్షణ ఇచ్చి.. ఉపాధి కల్పిస్తాం : కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

సమాజంలో అందరితో ట్రాన్స్ జెండర్లు సమానమేనని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డి.కిరణ్‌కుమార్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, సఖి కేంద్రం ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్‌లతో సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాంజెండర్లు చదువుకొని ఉద్యోగాలు పొందాలని సూచించారు. చిన్న, చిన్న వ్యాపారాలు చేపట్టి స్వయం ఉపాధి పొందాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. ట్రాన్స్ జెండర్‌లు జీవన భృతి కోసం ఇప్పటివరకు చేస్తున్న కార్యక్రమాలను మానుకొని వస్తే నైపుణ్య శిక్షణను ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ట్రాన్స్ జెండర్లకు కలిగే అసౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు వంటి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. జిల్లా న్యాయ సేవ సంస్థ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని చెప్పారు. సఖి కేంద్రం ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ పర్యవేక్షకుడు చంద్రసేనారెడ్డి, సఖి కేంద్రం ముఖ్య పరిశీలకురాలు భారతి, జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు, ట్రాన్స్ జెండర్లు, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్, జితేశ్ వి పాటిల్

రేపు చలో కలెక్టరేట్

- ధరలు తగ్గించాలని, నిరుద్యోగల సమస్యలపై ధర్నా
- పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలి : సీపీఐ(ఎం)


మాట్లాడుతున్న రమేశ్‌బాబు

నవతెలంగాణ-వర్ని

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న అనేక విధానాలతో నిత్యావసర ధరలు పెరిగాయని, నిరుద్యోగ సమస్య మరింత పెరిగిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. ధరలు తగ్గించడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ 21న సోమవారం పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో కలెక్టరేట్‌కు ప్రజలు, నిరుద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం వర్ని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తలుతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను, అధిక ధరల సమస్యతో ప్రజలపై అధిక భారం మోపిందని ఇట్టి సమస్యలపై ప్రజలతో కలుపుకొని సిపిఎం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు ధర్నాలు చేపట్టబోతుందని , ధర్నాల ను ,నిరసనలను జయప్రదం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ని ఏరియా నాయకులు నన్నేసాబ్, శంకర్, మల్లేష్, లక్ష్మి, సావిత్రి, దత్తు తదితరులు పాల్గొన్నారు.

నేడు డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ రాత పరీక్ష

- అన్ని ఏర్పాట్లు పూర్తి : అదనపు కలెక్టర్

నవతెలంగా ణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీ ఎస్ పీ ఎస్ సి) ద్వారా నేడు(ఆదివారం) జరుగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. రాత పరీక్ష కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 20 సెంటర్ లను ఏర్పాటు చేశామని వివరించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.00 గంటల వరకు రెండు సెషన్ లలో రాత పరీక్ష జరుగుతుందని తెలిపారు. www.tspsc.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్లలో అభ్యర్థి ఫోటో, లేదా పేరులో ఏవైనా తప్పిదాలు ఉన్నట్లయితే మూడు పాస్ పోర్ట్ సైజు ఫోటోల మీద గజిటెడ్ అధికారి సంతకంతో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమ వెంట సెల్ ఫోన్, క్యాలిక్యులేటర్, స్మార్ట్ వాచ్ వంటి ఎలక్ట్రానిక్ ఉపకారణాలేవీ వెంట తేకూడదని, బూట్లు ధరించి రాకూడదని అన్నారు. ఉదయం సెషన్ పరీక్షకు సంబంధించి 9.45 గంటలు, మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి 2.15 గంటల తరువాత వచ్చిన వారిని పరీక్షా కేంద్రం లోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ : 08462-220183ని సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.

వెంచర్‌పేరుతో
గుడిసెల భూములు లాక్కునే కుట్ర

- ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరుపేదల ధర్నా
- ఏండ్లుగా ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు, పేదలు

నవతెలంగాణ-నిజామాబాద్

ఎడపల్లి మండలం జాన్కంపేట్‌లో ఇండ్లు లేని నిరుపేదల పదేండ్లకు పైగా గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని, ఆ భూములపై కన్ను పడ్డ ప్రజాప్రతినిధులు.. వెంచర్ పేరుతో పేదలు వేసుకున్న గుడిసెలు తొలగించి ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు సబ్బని లత, జిల్లా కమిటీ సభ్యులు, బోధన్ ఏరియా కార్యదర్శి యేశాల గంగాధర్ మాట్లాడారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో గత పది సంవత్సరాలుగా సీపీఐ(ఎం) ఎడపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు లేని పేదలందరూ కలిసి గుడిసెలేసుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. 'ఈ మధ్యకాలంలో వారి నివాసానికి ఆనుకొని ఉన్నటువంటి గుట్టను మొరము తవ్వి దాన్ని చదును చేసుకొని రియల్ ఎస్టేట్ పేరు మీద వెంచర్ వేసి ప్లాట్లు చేసే ప్రయత్నంలో భాగంగా పేదలేసుకున్నటువంటి గుడిసెల స్థలం పైన ఉపసర్పంచ్ విజయ్ కుమార్ వారి బృందం కన్ను పడి పేదలందరికీ ఇక్కడ నుంచి గుడిసెల్ని తొలగించాలని రౌడీలతో దాడులు చేయించి పేదలను అక్కడి నుంచి పంపే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ భూమిలో ఏండ్లుగా గుడిసెలు వేసుకొని ఉంటున్న పేదలకు హక్కు ఉందని, కానీ ప్రభుత్వ భూమిపై కన్నేసిన ప్రజాప్రతినిధులు.. తమ అధికారంతో పేదల భూములను లాక్కునే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దాడులు చేసిన ఉపసర్పంచ్ పైన చట్టరీత్య చర్యలు తీసుకొని కేసు పెట్టి పేద ప్రజలకు న్యాయం చేసి కబ్జా ఉంటున్నటువంటి స్థలానికి పట్టాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు కేంద్ర ప్రభుత్వము ఇల్లు నిర్మించుకోవ డానికి ఐదు లక్షలు.. మొత్తం పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎడపల్లి మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు అధికారులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పేద ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్ విగ్నేష్, బాలరాజు, రాములు, సాయిలు, లక్ష్మణ్, మహేష్, నరేష్, రిజ్వానా, బేగం, రజయాబేగం, లక్ష్మి, పోషవ్వ రక్షిత, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో భూ పోరాటం

- ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకూ పోరు
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రజాపోరాటం ప్రారంభం


గుడిసెలు వేసుకునేందుకు చదును చేస్తున్న పేదలు, నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇళ్ల స్థలాల కోసం ప్రజాసంఘాలు పోరాటం ప్రారంభించాయి. ఎడపల్లి మండలం నెహ్రూ నగర్ గ్రామస్తులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం పోరాటం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుండి నిరుపేదలైన గ్రామీణ శ్రామికులు నెహ్రూనగర్‌లో ఇల్లు లేకుండా జీవిస్తున్నారు అని, ఓట్లు వచ్చినప్పుడల్ల వాడుకుని గ్రామపంచాయతీ, మండల, ఎమ్మెల్యే ఓట్లకు మాత్రమే వచ్చే ఎమ్మెల్యేలు, కనీసం వారి కష్టాలను గమనించి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టేయాలని సోయిలేకుండా ఉన్నారని అన్నారు. ఇది కరెక్ట్ కాదు అని చెప్పి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్మిక కర్షకుల ఐక్యతతో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం కలిసి భూ పోరాటానికి సిద్ధమైనట్టు తెలిపారు.

వివరాలు మెయిన్‌లో..

అవినీతి చేసినా.. అందలమెక్కిస్తారా.?

- ఏఎంసీ చైర్మన్‌గా సంగమేశ్వర్‌ను మళ్లీ ఎలా నియమించారు..?
- మద్నూరులో వ్యాపార సంస్థలు బంద్
- మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్‌కు హఠావో మద్నూర్‌కు బచావో అంటూ నాయకుల నినాదాలు





వ్యాపారాలు బంద్ పాటించి నిరసన వ్యక్తం చేస్తున్న వ్యాపారస్తులు, నాయకులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-మద్నూర్

సంగమేశ్వర్ అవినీతిపరుడని, గతంలో మాద్నూర్ ఏఎంసీ చైర్మన్‌గా వారి కుటుంబీకులు ఉన్న సమయంలో అనేక అక్రమాలకు పాల్పడ్డాడని, మళ్లీ చైర్మన్‌గా ఎలా నియమించారని పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు ప్రశ్నించారు. మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సంగమేశ్వర్‌ను హటావో.. మద్నూర్‌ను బచావో అంటూ శనివారం మద్నూర్ బంద్ పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతిపరున్ని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడం సరైనది కాదని అన్నారు. గతంలో ఒకసారి సంగమేశ్వర్ కుటుంబంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించారని, ఆ సమయంలో జరిగిన అవినీతిని రచ్చకెక్కినప్పటికీ మళ్లీ ఆయనకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడం ఎంతవరకు సభమని వారు ప్రశ్నించారు. ఆయన నియామకాన్ని మద్నూర్ వాసులందరూ వ్యతిరేకిస్తున్నారని, వెంటనే ఆయనను చైర్మన్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మోహిన్ పటేల్, పండిత్ రావు పటేల్, శంకర్ పటేల్, స్థానిక సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విట్టల్, మండల కేంద్ర యువకులు మాజీ జెడ్పిటిసి సభ్యుడు సాహెబ్ రావు, ఇతర పార్టీల నాయకులు భారీ ఆందోళన నిర్వహించారు.

మద్నూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

కామారెడ్డి జిల్లాలోనే ప్రఖ్యాతగాంచిన మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. భాజా భజంత్రీలతో బైక్ ర్యాలీలు చేపట్టి చెన్నమ్మ కోరి ఆలయంలో అన్నదానం రాష్ట్ర సరిహద్దులో గల సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్‌గా సంగమేశ్వర్, వైస్ చైర్మన్‌గా జుల్పే శివాజీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లతో కార్యదర్శి విఠల్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం టపాకాయలు కాలుస్తూ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమానికి ఎంపీపీ వాగ్మారే లక్ష్మీబాయి, జెడ్పిటిసి అనిత, మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, వైస్ ఎంపీపీ జైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

స్వశక్తితో ఎదుగుతున్న దేశం

- భారత్ ప్రపంచ స్థాయిలో సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్, పరిశోధనలకు వేదిక
- టీయూ సదస్సులో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

'భారత్.. అత్యంత వేగవంతంగా అభ్యున్నతి చెందుతున్న దేశం. స్వయం శక్తితో ఎదుగుతున్న దేశం. 20 దేశాలకు ఆధిపత్యం వహిస్తున్న సందర్భంలో భారతీయులమైన మనం అపారమైన గర్వం పొందుతున్నాము. తన కలను సాకారం చేసుకొనే దిశగా పయణించాలని' తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డా. తమిళిసై సౌందర రాజన్ అన్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో శనివారం "ఇండియాస్' జి 20 ప్రెసిడెన్సీ: ఆపర్చునిటీస్ అండ్ చాలెంజెస్ ఫర్ ఇండియా యాస్ ది గ్లోబల్ లీడర్" అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.


మాట్లాడుతున్న గవర్నర్

వివరాలు మెయిన్‌లో..

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

- వెల్మల్‌లో గ్రామస్తుల ధర్నా
- శాంతియుతంగా పోరాటం చేస్తున్నవారిపై ఎస్ఐ దురుసు ప్రవర్తన

నవతెలంగాణ-నందిపేట్

ఊరి తగాదాలతో యువకుడిని ప్రేరేపించి ఆత్మహత్య చేసుకునే విధంగా ఉసిగొల్పిన వారిపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండలంలోని వెల్మల్ సదానంద్ మృతదేహంతో గ్రామంలోని ప్రధాన రోడ్డుపై శనివారం బైటాయించారు. నాలుగు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకునే వరకూ దహన సంస్కారాలు చేపట్టబోమని బంధువుల, గ్రామస్తులు కలిసి ఆందోళన చేపట్టారు. తాము ఓట్లు వేస్తే గెలిచిన స్థానిక సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు ఇంత జరుగుతున్న ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ తగాదాలతో సామాన్య కుటుంబానికి చెందిన యువకుడు సదానంద్ చనిపోవడం చాలా బాధాకరమన్నారు. నిందితులు దర్జాగా ఊర్లో తిరుగు తున్నారని, ఫిర్యాదు చేసి నాలుగు రోజులవుతున్న ఎలాంటి స్పందన లేదన్నారు. పూర్తిగా వీడిసి వ్యవస్థను రద్దు చేసి గ్రామంలో వ్యక్తుల మధ్య ఉన్న సామాజిక దూరాన్ని రూపుమాపి కులపిచ్చి, మత పిచ్చి అంటు రెచ్చగొడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఇప్పటి కైనా అధికార యంత్రాంగం స్పందించి లేదా ఎమ్మెల్యే చొరవ తీసుకుని రోడ్డున పడ్డ సదానంద్ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పోలీసుల హామీతో ఆందోళన విరమించారు.

దురుసుగా ప్రవర్తించిన ఎస్సై శ్రీకాంత్

సామాన్య ప్రజలకు న్యాయం చేయాల్సిన పోలీసులే నిందితులకు వత్తసూవలకుతున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని శాంతియుతంగా నిరసన చేపట్టిన వారిపై కేసులు పెడతామని ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులుగా గ్రామంలో గొడవలు జరుగుతున్నా పట్టించుకోలేదని, తాము శాంతియుతంగా నిరసన చేపడితే తమపైనే కేసులు పెడతామని బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్ఐ ఒక వర్గానికి వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. నవతెలంగాణ వరుస కథనాలు ప్రచురించడం పట్లం విలేకరి శుభకర్ మూలంగానే ఈ సమస్య తలెత్తిందని వీడియో తీయాలని విలేకరిని భయభ్రాంతులకు గురి చేయడం కొసమెరుపు. దీంతో అక్కడున్న గ్రామస్తులు ఆగ్రహించడంతో వెనక్కుతగ్గారు. శాపూర్‌లో 80 కుటుంబాలు తన సామాజిక వర్గం బహిష్కరణ కాగానే ఆగమేఘాల మీద వెళ్లి వీడిసి సభ్యులను బెదిరించిన ఆయన ఇప్పుడు నిండు ప్రాణం పోయినా తమకేమీ పట్టనట్టుగా ఉండడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. వారికో న్యాయం..? మాకో న్యాయమా అని ప్రశ్నించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు తీరు నశించాలని అంటూ నినాదాలు చేశారు. బాధ్యతలు చేపట్టిన ఐదునెలకే ఇలా తమ వర్గం వైపు ఏకపక్షంగా వ్యవహారించడం పట్ల గ్రామస్తులు మండిపడ్డారు. తమ మండలంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమల్లో లేదని, పోలీసు ఉన్నతాధికారులు, సీపీ మండలంపై నజర్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఆందోళన చేపట్టిన వారితో మాట్లాడుతున్న పోలీసులు

మెడికో విద్యార్థి ఆత్మహత్య

- నిజామాబాద్ మెడికల్ కళాశాలలో కలకలం
- సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా జిన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన దాసరి హర్ష(22) నిజామాబాద్ నగరంలోని మెడికల్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కళాశాలలోని బాయ్స్ హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కాగా ఎంబీబీఎస్ విద్యార్థి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విఘ్నేశ్ డిమాండ్ చేశారు.


మృతిచెందిన హర్ష

వివరాలు మెయిన్‌లో..

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్దన్, ధర్పల్లి జడ్పిటిసి జగన్ ఆదేశానుసారం నిజామాబాద్ రూరల్ మండలం చక్రధర్ నగర్ తండాలో శనివారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వచ్చిన సిసి రోడ్ల పనులను ఎంపీపీ బానోత్ ప్రేమ్ నాయక్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, సర్పంచ్ హరినాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, పీఆర్ ఏఈ నరేష్ తదితరులు భూమిపూజ చేసి ప్రారంభించారు.



రోడ్డుపనులు ప్రారంభించిన నాయకులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని లింగాపూర్ గ్రామంలో సర్పంచ్ బత్తూరు సాయిలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కోరే ముత్యమ్మకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే షకీల్ ఆమీర్ సహకారంతో ముత్యమ్మకు 12 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు టేకు పోశెట్టి, గంగోని గంగాధర్, కోరే రవి, గొట్టుముక్కల సాయిలు, బోయేడి సుమన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీపీ పస్కనర్సయ్య
- మండల సమావేశానికి సర్పంచుల గైర్హాజరు

నవతెలంగాణ-ఆర్మూర్

వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలిసి ప్రజల సమస్యలు తీర్చడంలో ముందుండాలని సమావేశానికి అధ్యక్షతన వహించిన ఎంపీపీ పస్కనర్సయ్య అన్నారు. పట్టణ ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి సర్పంచులు గైరాజరయ్యారు. మండలంలోని అంకాపూర్, గోవింద్‌పేట్, మంతిని ఎంపీటీసీలు ఎంసి గంగారెడ్డి, యాళ్ల రాజ్ కమార్, గంగారాంలు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు ప రైతులకు అవగాహన కార్యక్రమాలు కల్పించాలని, రైతు భవనంలో బ్లాకు బోర్డులు పెట్టాలని, మండలంలోని వివిధ గ్రామాలలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలని, అంకాపూర్ గ్రామంలో వోల్టేజీతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంకాపూర్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సర్వే సక్రమంగా కొనసాగించాలని, ఒంటరి మహిళలు, వితంతువుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, మిషిన్ భగీరథ పైపులు పగిలిన అధికారులు స్పందించాలని అన్నారు. మామిడిపల్లి నుండి గోవింద్‌పేట్ వెళ్లే దారిలో గల రైల్వే బ్రిడ్జిపై చెత్త నిండి ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గోవింద్ పెట్ గ్రామంలో పశు వైద్యశాల శిథిలావస్థకు చేరిందని అన్నారు. మాచర్ల గ్రామ సర్పంచ్ గంజి నరసయ్య మాట్లాడుతూ.. గ్రామంలోని విద్యుత్ స్తంభాలు పాతవి తీసివేయాలని నాలుగు సంవత్సరాల నుండి చెబుతున్న పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ లక్ష్మి, జెడ్పిటిసి మెట్టు సంతోష్, వైస్ ఎంపీపీ మోతే భోజ కళ, వ్యవసాయ అధికారి హరికృష్ణ, పశు వైద్యాధికారి లక్కం ప్రభాకర్, మండల విద్యాధికారి రాజా గంగారాం, డిప్యూటీ తాసిల్దార్ విజయ్ కాంత్, మిషన్ భగీరథ ఏఈ అనిల్, మహిళ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ సమత, గోవింద్ పేట్ పి హెచ్ సి వైద్యురాలు మానస, పిప్రీ గ్రామ అంగన్వాడి సూపర్వైజర్ వెంకట రమణమ్మ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

వసతి గృహాల బస కార్యక్రమం చేపట్టాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వసతి గృహాల బస కార్యక్రమం చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ స్థాయి అధికారుల నుండి జిల్లా స్థాయి అధికారులు వారం రోజులపాటు వసతి గృహాల బస కార్యక్రమం నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరెట్ ఏఓ ప్రశాంత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ హాస్టల్స్, మోడల్ స్కూల్ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కరించడానికి గ్రామస్థాయి అధికారుల నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు వారం రోజులపాటు హాస్టళ్లలో పర్యటన చేస్తూ వసతి గృహాల బస నిర్వహించాలని అన్నారు. కిరాయి భవనంలో ఉంటున్న హాస్టల్లో విద్యార్థులకు వసతులు, అన్ని హాస్టల్ లలో మెనూ ప్రకారం భోజనంతోపాటు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ వివిధ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. పదవ తరగతి, ఇతర తరతలు చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్న ఈ తరుణంలో రాత్రిపూట చదువుకోవడానికి ఉండాల్సిన సౌకర్యాలు మెరుగుపరచడం కోసం అధికారులు వసతి గృహాల బస కార్యక్రమం ద్వారా విద్యార్థులతో చర్చించి సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, పి. హనుమాన్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్‌లోని చిన్నపూర్ గ్రామ సమీపంలోగల అటవీ క్షేత్రాన్ని శనివారం బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సందర్శించారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనదర్శిని కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటవీశాఖ డివిజన్ అధికారులు శ్రీనివాస్, సౌమ్య వివిధ రకాల చెట్ల గురించి వివరించారు. చెట్లను ఏ విధంగా పెంచాలి.. ఏ విదంగా సంరక్షించాలో వారు వివరించారు. కార్యక్రంలో 150 మంది విద్యార్థిని విద్యార్థులతోపాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలకు బెంచిల వితరణ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పందిమడుగు గ్రామానికి చెందిన అసిస్టెంట్ కమిషనర్ సెంట్రల్ టాక్స్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న జరుపుల గోవింద్ నాయక్ ఐఆర్ఎస్ శనివారం తాటపల్లి గ్రామానికి జీసీటీ శ్రీ సాయి ఎడ్యుకేషన్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఎంపీపీస్ పాఠశాల పిల్లలకు 17 బెంచిలు సుమారు 60 వేల రూపాయలు విలువగలవి అందించారు. అనంతరం గోవింద్ ఐఆర్ఎస్‌ని సర్పంచ్, గ్రామ పెద్దలు సన్మానించారు. ఈ సంస్థ మారుమూల గ్రామాల ఎంపీపీఎస్ స్కూళ్లకు బెంచీలను వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాటిపల్లి సర్పంచ్ తిరుపతి నాయక్, స్కూల్ హెడ్ మాస్టర్ లత, స్కూల్ చైర్మన్, వార్డ్ మెంబర్ గంగాధర్, వీడీసీ చైర్మన్ బాలు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుపతి, యువకులు రాము, ఏంజి నాయక్, రాములు, మోహన్, రాజు, గోపాల్ స్కూల్ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులతోమాట్లాడుతున్న గోవింద్‌నాయక్

విద్యుత్ రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శం

ఎంపీటీసీ సత్య నారాయణ



సర్పంచ్‌తో కలిసి భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ

నవతెలంగాణ-ముప్కాల్

సమైక్య పాలకుల మాటలను పటాపంచలు చేస్తూ సీఎం కేసీఆర్ విద్యుత్ రంగంలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని ఎంపీటీసీ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని నల్లూరు గ్రామంలో నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు శనివారం సర్పంచ్ సుగుణతో కలిసి ఎంపీటీసీ సత్యనారాయణ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయానికి 24 గంటలు ఉచిత కరెంటు ఇవ్వడంతో పాటు పరిశ్రమలకు 24 గంటలు కరెంటు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. గతంలో ఉమ్మడి మండలంలో లోవోల్టేజీతో రైతుల బోరు మోటర్లు తరచూ కాలిపోయేవన్నారు. ఈ సమస్య లేకుండా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను మంత్రి ప్రశాంత్ రెడ్డి ఏర్పాటు చేయిస్తున్నారాని అన్నారు. అనంతరం మంత్రికి గ్రామం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఎస్ఈ రవీందర్, డీఈలు వెంకటరమణ, హరిచంద్, ఏడీఈ రాజేశ్వర్, ఏఈలు వినోద్, రవి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

మంత్రి సమక్షంలో పుట్టినరోజు వేడుకలు



ముస్కుభూమేశ్వర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మాజీ సర్పంచ్, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను కొత్తపల్లి గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో రాష్ట్ర మంత్రివర్యులు వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో శనివారం నిర్వహించారు. భూమేశ్వర్ రెడ్డిని మంత్రి ఆశీర్వదించారు. అనంతరం మంత్రివర్యులు సతీసమేతంగా స్వామివారి దర్శనం చేసుకున్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాల్కొండ ఉమ్మడి మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఎస్సి,ఎస్టీ,బీసీ, మైనార్టీ నాయకులు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నట్టల నివారణా మందు పంపిణీ

- ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-ధర్పల్లి/మాక్లూర్/ముప్కాల్

ప్రతి ఆరు నెలలకు ఒక సారి ప్రభుత్వం ద్వారా గొర్లకు, మేకలకు ఉచితంగా అందించే నట్టల నివారణ మందువేసే కార్యక్రమాన్ని శనివారం ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మొదటి విడత పంపిణీలో భాగంగా మండలకేంద్రంలోని గొర్లకు నట్టల నివారణ మందు తాగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మొదటి విడత రెండువేల గొర్లకు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణి చేయడం జరుగుతుందని అన్నారు. వారంరోజులపాటు జరిగే ఈకార్యక్రమము మండలంలోని అన్ని గ్రామాల్లో సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్, డైరెక్టర్ సభవత్ శ్రీనివాస్ నాయక్, పుప్పాల సుభాష్, మండల పశువైద్య అధికారి గంగాప్రసాద్, పశు సంవర్ధక శాఖా సిబ్బంది, వీఏ శివ కుమార్, సుభాష్ డిఎస్ సర్దార్, గోపాలమిత్ర, గొర్రెలు, మేకల పెంపకం దారులు పాల్గొన్నారు, వి ఎల్ ఓ వినిత, జేవీవో గంగజమున, విఏ అహ్మద్ భాషా, శ్రీనివాస్, సాజిద్, సిబ్బంది సుదీర్, దిలీప్, బేగ్, జైల్ సింగ్ పాల్గొన్నారు.



ధర్పల్లి: నట్టల నివారణ మందు వేస్తున్న ఎంపీపీ

మాక్లూర్: మండలంలోని కల్లెడ, చిన్నాపూర్ గ్రామాలలో ఉచిత నట్టాల నివారణ మందుల పంపిణీ పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి రైతు తమ జీవాలకు నట్టాల నివారణ మందులను వేయించాలని పశు వైద్యులు కిరణ్ దేశ్‌పాండే తెలిపారు. 6605 జీవాలకు ఉచిత మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ సుకీ సుజాత సుధాకర్, ఉపసర్పంచ్ మనీష్ గౌడ్,



మాక్లూర్ మండలంలో..

ముప్కాల్: మండలంలోని వేంపల్లి గ్రామంలో సర్పంచ్ జక్క మల్లుబాయి గంగాధర్ గ్రామంలోని గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్టు పశుసంవర్ధక శాఖ వైద్యులు గౌతమ్ రాజ్ తెలిపారు. గ్రామంలో వెయ్యికి పైగా గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్క మల్లుబాయి, ఉప సర్పంచ్ జక్క గంగాధర్, ఇంఛార్జి వెటర్నరీ డాక్టర్ గౌతమ్ రాజ్, విఎల్వో సరస్వతి, పసుమిత్ర సభ్యులు ప్రణీత్, లక్ష్మీ, గొర్రెల, మేకల యజమానులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో 63 మంది గైర్హాజర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్ ప్రాక్టికల్ రెండవ స్పెల్ ఐదవ రోజు మొత్తం 63 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి(డిఐఇఓ) రఘురాజు తెలిపారు. ఉదయం జనరల్ విద్యార్థులు 11 మంది, ఒకేషనల్ 3 విద్యార్థులు, మధ్యాహ్నం జనరల్ 5 , ఒకేషనల్ 44 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఆదివారం నుండి మూడో విడత ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయని డిఐఈఓ తెలిపారు. జనరల్ విద్యార్థులు ఉదయం 182 మందికి గాను 171మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ 120మంది విద్యార్థులకు గాను 117మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్ 122మంది విద్యార్థులకు గాను 117మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ 168మంది విద్యార్థులకు 124 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి ఆరుపరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్నయ్య, కనకమహాలక్ష్మి , హై పవర్ కమిటీ రాజీయుదిన్, ఫ్లయింగ్ స్క్వాడ బృందాలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

మెడికల్ విద్యార్థి మృతికి సంతాపం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. నిజామాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్, కళాశాల విద్యార్థుల శనివారం హర్షకు జోహార్ అని నినాదాలు చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

నందిగాంలో మోటార్ పడవ ప్రారంభం

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని నందిగాం గ్రామంలో ఎంపీటీసీ లలిత సంజీవ్ ఆధ్వర్యంలో నిర్మించిన మోటార్ పడవను ఎంపీపీ సంగెం శ్రీనివాస్ సర్పంచ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, మత్స్యకారుల సహకారం కోసం ఎంపీటీసీ లలితా సంజీవ్ 60 వేల రూపాయలతో కార్మిక కర్షక వారధి రథంను ప్రారంభించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ మోటార్ పడవ ఆపద కాలంలో వారధిగా నిలబడుతుందని పలువురు అభినందించారు. కార్యక్రమంలో కిషన్ రావు, నాగారావు, గంగాధర్, సాయన్న, మహేష్, సతీష్, దేవరాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పోడు భూములకు పట్టాలివ్వాలి : ఏఐకేఎంఎస్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పోడు భూములకు పట్టాలివ్వాలని అఖిల భారత రైతు కూలి సంఘమ్ (ఏఐకెఎంఎస్) జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. శనివారం ఏఐకెఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా ఉపాధ్యక్షుల సాయన్న అధ్యక్షతన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అడవి భూములను, సంపదను బడా కార్పొరేట్ కంపెనీలకు బహుళ జాతి కంపెనీలకు, ఆదానీ అంబానీలకు కట్ట బెడుతున్నారని అన్నారు. ఆదివాసీలు, గిరిజనులు పేదలు సాగు చేసుకుంటున్న భూముల నుండి వారిని గెంటివేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం పేరున తమ భూముల నుంచి భేదాకలు చేస్తున్నారని అన్నారు. అటవీ సంరక్షణ నియమాలు 2022ను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి, కేంద్రానికి లేఖ రాయాలని ఆయన డిమాండ్ చేశారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని అనుసరించి పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ అమలు చేయాలని, పసుపును క్వింటాలుకు మార్కెట్లో 5000 మాత్రమే వస్తుందని, 15వేల రూపాయలు కొనుగోలు మద్దతు ధర అమలు చేయాలని అన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని అన్నారు. సమావేశంలో పర్వయ్య కార్ల్ మార్క్స్ బాబురావు, దేవ సహాయం బుచ్చన్న, గోపాల్, సాయిలు, శ్రీను, కే.సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు కరువు భత్యం అమలు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీడీ కార్మికులందరికీ కరువు భత్యం (వీడీఏ) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఎన్ఆర్ భవన్, కోటగల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరిల కార్మికులకు కరువు భత్యం (విడిఏ) పెరిగిందని అన్నారు. వినిమయ ధరల సూచి 1602 నుండి1696 పాయింట్లకి పెరిగిందని తెలిపారు. అంటే 94 పాయింట్లు పెరిగాయని, 1994 అగ్రిమెంట్ ప్రకారం పాయింట్‌కు పది పైసలు చొప్పున 9 రూపాయల 40 పైసలు పెరిగిందని తెలిపారు. ఈ పెరుగుదల ఏప్రిల్ ఒకటి 2023 నుండి అమలులోకి వస్తుందని అన్నారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు వీడీఏ) 9.40 పైసలుగా పెంచాలని తెలిపారు. ఆకు, తంబాకు పంచేవారు, గుమస్తాలకు, అకౌంటెంట్లకు, బట్టి వాల, చెన్నివాల, గంప వాల, వాచ్మెన్‌లకు నెల ఒక్కింటికి 282 రూపాయల చొప్పున పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ ప్యాకర్లకు ఒక్కరోజు పనికి కరువుభత్యం(విడిఏ) తొమ్మిది రూపాయల 40 పైసలు లక్ష బీడీ ప్యాకింగ్‌కు ఎంత అనేది నిర్ణయించబడుతుందని తెలిపారు. దీని అమలుకు పోరాడాలని తెలంగాణ తెలిపారు. కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టి.యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరేందర్, జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకన్న, జిల్లా నాయకులు సాయరెడ్డి లు పాల్గొన్నారు.

బడి అభివృద్ధికి గ్రామస్తుల తోడ్పాటు అభినందనీయం

జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులు తోడ్పడడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం రాత్రి జడ్పీహెచ్ఎస్ పడగల్ పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో పాఠశాల నిర్వహిస్తున్న కార్యక్రమాలు బాగున్నాయని అన్నారు. పాఠశాల అభివృద్ధిలో తోడ్పడుతున్న గ్రామ పాలకవర్గం, గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామస్తులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించడం అనేది విద్యాశాఖకు గర్వకారణమని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సభాధ్యక్షులు యానం విజయ్ మాట్లాడుతూ.. పాఠశాలలోని విద్యార్థులు అన్నిరంగాల్లో ముందున్నారని పదవ తరగతి ఫలితాలలో ఎన్ఎంఎంఎస్ ఫలితాలలో విజయాలు సాధిస్తున్నటువంటి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. రాబోయే పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వనజ రెడ్డి, సర్పంచ్ ద్యావతి వర్షిని రాజకుమార్, ఎంపిటిసిలు గైని పాపాయి విజయ అమోస్, హేమలత శ్యామ్ రావు ,మన ఊరు మనబడి కమిటీ సభ్యులు రాజకుమార్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శ్యామ్ రావు, ముత్తన్న, ప్రసాద్, మలకయ్య రాజేందర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జమాలుద్దీన్, ఉపాధ్యాయులు మంచిర్యాల సురేష్ కుమార్, పాఠశాల చైర్మన్ జరి లత, రాగి ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాలాగే నా కుమారున్ని ఆదరించండి

- రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-సిరికొండ

మా తాత, ముత్తాతలు ప్రజలకు చేసిన సేవలను గుర్తించి నన్ను ఏ విధంగా ఆదరించారో, అదేవిధంగా రానున్న ఎన్నికల్లో తన కుమారుడిని కూడా అదేవిధంగా ఆదరించాలని రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. శనివారం తన స్వగ్రామమైన చీమన్ పలి లో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి భూమి పూజ సకుటుంబ సమేతంగా నిర్వహించారు. ఎండోమెంట్ ద్వారా 28 లక్షలు, తన సొంత నిధులు సిడిపి నుండి 20 లక్షల రూపాయలు ఆలయ నిర్మాణానికి మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.... తమ పెద్దలు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, కష్టసుఖాలలో పాలుపంచుకున్నారని, తనను ఆదరించి ఇంతటి స్థాయికి చేర్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ఎన్నికల్లో తన కుమారుడు ధర్పల్లి జడ్పిటిసి, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్ ముందుకు వస్తున్నారని, తన కుమారుని కూడా తనలాగే ఆదరించాలని ప్రజలను కోరారు. అనంతరం చీమనుపల్లి పరిధిలోని జినిగ్యాలలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈయన వెంట ఎంపీపీ మాలావత్ సంగీత రాజేందర్, జెడ్పిటిసి మాలావత్ మాన్సింగ్ నాయక్, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు నారబోయిన శ్రీనివాస్, సర్పంచ్ పద్మ శివారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు ఆకుల తిరుమల్, సర్పంచులు ఎన్నం రాజారెడ్డి, సర్దన్ భాగ్య గంగా నర్సయ్య పద్మ మదన్ లాల్, ఉపసర్పంచు బడాల రామకృష్ణ, రఘువాస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి భూమిపూజచేస్తున్న ఎమ్మెల్యే

ప్రజల పైసలతో ఆటలా ?

- ఎల్ఐసి పెట్టుబడులు ఆవిరవుతుంటే మౌనం ఎందుకు ?
- సీబీఐ, ఈడీ రాజకీయ ప్రయోజనాల కోసమేనా ?
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నల వర్షం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజల పైసలతో ఆటలా? ఎల్ఐసి పెట్టుబడులు ఆవిరవుతుంటే మౌనం ఎందుకు? సిబిఐ, ఈడి రాజకీయ ప్రయోజనాల కోసమేనా? అని ఆదాని వ్యవహారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదాని కుంభకోణంలో ప్రజలు పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసి సంస్థ డబ్బులు ఆవిరవుతుంటే కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. అదాని కంపెనీల్లో ఎల్ఐసి పెట్టిన పెట్టుబడుల విలువ 11 శాతం మేర పడిపోవడం పట్ల కవిత తీవ్రంగా స్పందించారు. ఇంత పెద్ద కుంభకోణం జరిగి దాదాపు 12 లక్షల కోట్లు నష్టపోయినా సీబీఐ, ఈడి, రిజర్వ్ బ్యాంకు వంటి సంస్థలు ఎందుకు మౌనంగా ఉంటున్నాయని ప్రశ్నించారు. సంస్థలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే సంస్థలేనా అని నిలదీశారు. హిడెన్బర్గ్ నివేదిక బహిర్గతం అయినప్పటి నుంచి ఆదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు జరిపించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తూనే ఉందని గుర్తు చేశారు. అప్పుడే కేంద్రం జేపీసీ ఏర్పాటు చేస్తే ప్రజలు మరింత నష్టపోయేవారు కాదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్రం కళ్ళు తెరిచి మరింత నష్టం జరగకుండా చూడాలని సూచించారు. జేపీసీని నియమించాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు నిధిని ఏర్పాటు చేయడం అభినందనీయం

- రవాణా శాఖ అధికారి వెంకట రమణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు నిధిని ఏర్పాటు చేయడం అభినందనీయమని రవాణా శాఖ అధికారి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన సమావేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవాణా శాఖ అధికారి వెంకట రమణ హాజరయ్యారు యూవి కేన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సృజన్ ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించే సేవా కార్యక్రమాలకి సంబంధించి ఏర్పాటు చేసిన నిధికి 55,555 అందించటం అభినందనీయమన్నారు. అనంతరం యూవి కేన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సృజన్ మాట్లాడుతూ.. మానవత్వంతో సేవ చేసే సంస్థలకి అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు మాట్లాడుతూ నిధిని ఏర్పాటు చేసి ఆయా కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దారం గంగాధర్, చిటిమిల్ల హరిప్రసాద్, పుష్పవతి, ముస్కు రామేశ్వర్ రెడ్డి, సంజీవ్ రావ్, సూభాష్, వినయ్, ఆనంద్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వేతన సవరణ కాల పరిమితి ముగిసినందున వెంటనే పీఆర్సీ కమిటీ నియమించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ లోప భూయిష్టంగా తయారైందని, నగదు రహిత వైద్యం ఎక్కడా అమలులో లేదని వారు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు పాలకుర్తి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మచ్చారంగయ్య మాట్లాడుతూ.. ఈపీఎఫ్ పెన్షనర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 9000 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ గవర్నమెంట్ సెంటర్లను వరంగల్ నిజామాబాదులో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు. సమావేశంలో ఇంకా సీతారాం , అరుణ రామ్మోహన్ రావు , వైకుంఠం,సుజవతి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌కు మెమో జారీ

నవతెలంగాణ-పిట్లం

సాంఘిక సంక్షేమ ప్రత్యేక బాలుర వసతి గృహం ఇంచార్జి వార్డెన్ రాజేందర్‌కు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేష్ మెమో జారీ చేశారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ ప్రత్యేక బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ పరిసరాలను, గదులను, స్టోర్ రూమ్, వంటగదిని, టాయిలెట్స్‌ను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌తో పాటు సిబ్బందికి మెమోలు జారీ చేశారు. పూర్తి కాలం వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న కిషోర్ పంతులు గ్రూప్ వన్ పరీక్షల నిమిత్తం లాంగ్ లీవ్‌లో ఉన్నందున ఫిబ్రవరి ఒకటిన చార్జి తీసుకున్న పెద్దకొడప్‌గల్ వార్డెన్ రాజేందర్ పిట్లం ఇన్చార్జి వార్డెన్‌గా కొనసాగుతున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డివిజనల్ అధికారి లియో ఉన్నారు.

ఘనంగా గంగమ్మ ఉత్సవాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు గంగమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు గంగపుత్ర ముదిరాజ్ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 26న ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గంగ తెప్పోత్సవం, ఎడ్లబండ్ల ఊరేగింపు, బోనాల ప్రదర్శన ఉంటుందన్నారు. 27న గంగమ్మ తల్లి కళ్యాణం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి ఎమ్మెల్యే గంపగోవర్దన్ తనయుడు శశాంక్ హాజరవుతారని ప్రతినిధులు తెలిపారు. 28న ఆలయం వద్ద మహా జాతర కొనసాగుతుందని, మార్చి 1న పెద్దఎత్తున ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున గంగమ్మ తల్లి ఉత్సవాలకు తరలిరావాలని వారు కోరారు.

జిల్లా స్థాయి బయో సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాణించిన మోడల్ స్కూల్ విద్యార్థిని

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



విద్యార్థికి అభినందన

జిల్లా స్థాయిలో జరిగిన బయో సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని సీహెచ్ సహస్ర 9వ తరగతి మూడో బహుమతిని పొందింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బయో సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. జిల్లా స్థాయిలో మూడవ బహుమతి పొందిన సహస్రను జిల్లా విద్యాశాఖ అధికారి రాజు బహుమతిని అందజేశారు. జిల్లాస్థాయిలో బహుమతి సాధించిన సహస్రకు ప్రిన్సిపాల్ సాయిబాబా, ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీనివాసు, శశిశంకర్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాలాభివృద్ధి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్ర ప్రభుత్వ విప్ గంప గోవర్దన్ సహకారంతో గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని పెద్ద మల్లారెడ్డి సర్పంచ్ లక్ష్మీ రాజలింగం తెలిపారు. శనివారం గ్రామంలో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంతరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ హన్మంత్‌రెడ్డి, గ్రామ ఎంపీటీసీ సభ్యులు సాయగౌడ్, మంజుల రాములు, సొసైటీ అధ్యక్షులు రాజాగౌడ్, రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ లింగం, సచివాలయ కార్యదర్శి లక్ష్మీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలను సాధించాలి



స్టడీ మెటీరియల్స్‌తో విద్యార్థులు

నవతెలంగాణ-రామారెడ్డి

పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి, మంచి మార్కులతో మంచి ఫలితాలను తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు సామల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని స్కూల్ తాండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు, ప్రభుత్వం అందజేసిన స్టడీ మెటీరి యల్, స్పోర్ట్స్ మెటీరియల్‌ను గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ స్వప్న, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, పంచాయతీ పాలకవర్గంతో కలిసి విద్యా ర్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కష్టపడి చదివి, మంచి మార్కులతో తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ బట్టు పద్మ నరేష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మండలంలోని వాజీనగర్ గ్రామానికి చెందిన కర్రోల మౌనిక, దొడ్ల నిఖిల ఇద్దరు లబ్దిదారులకు జుక్కల్ ఎమ్మెల్యే, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమంత్ షిండే చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి లబ్ది చేకూరుస్తున్నారని.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి సంక్షేమ పథకాల ద్వారా పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్లకు వారి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేసి ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీహరిరాజు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బసవరాజ్ పటేల్, ఎంపీటీసీ బండకింది సాయిలు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సంతోష్ కులకర్ణి, నాయకులు తోట లక్ష్మీనారాయణ, సంతోష్, గంగారాం, దామోదర్‌రెడ్డి, తోటసాయిలు, తోటసాయన్న, అశోక్ పటేల్ ఉన్నారు.

నీటి ట్యాంకర్‌తో మొక్కలకు నీరు

నవతెలంగాణ-బోధన్



మొక్కలకు నీరు పడుతున్న దృశ్యం

ఇప్పుడి ప్పుడే ఎండలు విపరీతంగా ఉండడంతో మొక్కలు ఎండిపో తున్నాయి. దాంతో వాటిని ఎలాగైనా కాపాడు కోవాలనే ఉద్దేశంతో సాలూర మండలంలోని చెక్‌పోస్ట్ అధికారి పండరి ప్రత్యేకంగా నీటి ట్యాంకర్ ఏర్పాటు చేసి మొక్కలకు ప్రతి రోజు నీటిని అందిస్తున్నారు. చెక్ పోస్ట్ సమీపంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ వహించి హరితహారంలో పూల మొక్కలు, పండ్ల మొక్కలను నాటించారు. ఈ మొక్కలకు చెక్‌పోస్ట్ సిబ్బంది ప్రతిరోజూ నీటిని అందిస్తూ కాపాడుతున్నారు.

పెద్దవాగులోకి వెళ్లడానికి రోడ్డు కావాలి

- గ్రామస్తుల ఆందోళన రాస్తారోకో
- తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రం సమీపంలో పెద్దవాగులోకి వెళ్లడానికి రోడ్డు కావాలని లింగంపేట్ గ్రామస్తులు శనివారం ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా కుల సంఘాల సభ్యులు మాట్లాడుతూ.. పెద్దవాగు బ్రిడ్జి పక్కన పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న గుర్రం మడుగులోనికి రెండు దారులు ఉండేవని, ఆ దారుల గుండా వినాయకచవితికి, బతుకమ్మ పండుగలకు నిమజ్జనానికి వెళ్లేవారిమని తెలిపారు. ఈ దారులకు ఇరువైపులా ముస్లింలకు కబరస్థాన్ ఈదుగాలో ఉన్నాయని, రెండు దారుల వద్ద మైనార్టీలు ఈద్గా విస్తీర్ణం పెంచి నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. గుర్రం మడుగులోకి వెళ్లి దారి మైనారిటీల ఆధీనంలో ఉండడంతో వాహనదారులకు వెళ్లడానికి వీల్లేకుండా పోయిందని చెప్పారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, లింగంపేట్ ఎస్ఐ శంకర్ సిబ్బందితో నచ్చచెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దరఖాస్తులకు

ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని అర్హులైన వారి నుంచి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపునకు దరఖాస్తు స్వీకరణకు వార్డుల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. 1వ వార్డు ప్రజలు అంగన్వాడీ కేంద్రం ఎర్రమను కుచ్చులో, 2 వార్డు వారు మున్సిపల్ కార్యాలయంలో, 3 వార్డు వారు తహసీల్దార్ కార్యాలయంలో, 4వ వార్డు వారు అంగన్వాడీ కేంద్రం దేవునిపల్లిలో, 5వ వార్డు వారు పాత గ్రామపంచాయతీ గండిమాసానిపేటలో, 6వ వార్డు వారు ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఇందిరానగర్‌లో, 7వ వార్డు వారు ముదిరాజ్ సంఘం ఆదర్శనగర్‌లో, 8వ వార్డు వారు అంగన్వాడీ కేంద్రం బిందర్లో, 9వ వార్డు వారు వైశ్య భవన్‌లో, 10వ వార్డు వారు అంగన్వాడీ కేంద్రం రిక్షా కాలనీలో, 11వ వార్డు వారు మహిళా మండలి భవనంలో, 12వ వార్డు వారు అయ్యప్ప ఆలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో తమ దరఖాస్తులు ఇవ్వాలని ఆయన కోరారు. దరఖాస్తులను ఈనెల 27వ తేదీ నుంచి మార్చి 3వరకు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీలతో కూడి మున్సిపల్ పరిధిలో నివాసమున్నవారై ఉండాలని ఆయన తెలిపారు.

ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ గిరిజన సంఘం డిమాండ్

నవతెలంగాణ-గాంధారి



మాట్లాడుతున్న మోతీరాం నాయక్

ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం తెలంగాణ గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం నాయకులు మోతీరం నాయక్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా మెడికల్ విద్యార్థిని ధారావత్ ప్రీతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వైద్యం ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరించాలన్నారు. అఘాయిత్యానికి పాల్పడిన శాడిస్ట్‌ను ఉరి తీయాలని, లేకపోతే గిరిజన సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు మోతీరాం నాయక్, ప్రకాష్‌నాయక్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గేమినాయక్, మాన్సింగ్, శంకర్, దేవి సింగ్, సాయిలు, మధు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని పద్మశాలి భవనంలో పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహులు మాట్లాడుతూ.. పద్మశాలీలు ఐక్యతగా ఉండి తమ కష్టాలను బాధలను ఇతరత్రా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అన్ని విధాల సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రావాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ పద్మశాలి కుటుంబానికి అండగా ఉంటానని, అవసరమైన మేరకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని పద్మశాలీలందరూ తనకు అండగా ఉండాలని తోడ్పాటును అందించాలని కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు తాను దగ్గరుండి పోరాడి అందరికీ ఇప్పించే విధంగా ప్రయత్నిస్తానని, ప్రయివేటు ద్వారా కంటి శిబిరాలు వైద్య శిబిరాలు ఇతరత్రా వికలాంగులకు సైకిళ్లు, వృద్ధులకు వీల్‌చైర్స్ ఉచితంగా ఇప్పించ డానికి ముందుం టానని తెలిపార. నిరుపే దలైన పద్మశాలీలకు పరిచయ వేదిక ఏర్పాటు చేసి పెండ్లి సంబంధం కుదిరితే జంటకు రూ.1000 ఇస్తానన్నారు. అలాగే మార్కండేయ మాల ఎవరైనా ధరిస్తే వారికి రుద్రాక్ష మాల దీక్షవస్త్రాలు అందజేస్తానని తెలియజేశారు. సమావేశంలో పద్మ దశరథం, గుజ్జరి లక్ష్మీనారాయణ, దేవసాని పోశెట్టి, తమ్మల భూమేశ్వర్, విద్య రవి, షేర్ల సోమేశ్వర్, మోహన్, దేశపతి కృష్ణమూర్తి, చేర్ల విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు అవగాహన

నవతెలంగాణ-జుక్కల్



తాపీమేస్త్రీలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఓం రుద్ర ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు బంగూర్ సిమెంట్‌పైన అవగాహన సమా వేశం నిర్వహించి నట్టు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మేనేజర్ శ్రీపాద్, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ సిసింద్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తాపీ మేస్త్రీలకు బంగూర్ సిమెంట్ వలన ఉపయోగాలు, నాణ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓం రుద్ర ట్రేడర్స్ నిర్వాహకులు అర్మాన్, సాయి, కపిల్, తాపీ మేస్త్రీలు అబ్దుల్లా, బాలాజీ, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చట్ట పరమైన చర్యలు

నవతెలంగాణ-దోమకొండ



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ తహసీల్దార్ కౌశిక, ఎస్ఐ సుధాకర్ అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని ఓ కుటుంబంలో బాలికకు బాల్య వివాహం చేయనున్నట్టు తెలిసిన సమాచారం మేరకు ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తల్లితండ్రులకు శనివారం అవగాహన కల్పించారు. బాలికకు వచ్చే నెలలో వివాహం చేస్తున్నారని, బాలికకు 18 ఏండ్ల వయస్సుకు ఆరు నెలలు తక్కువ ఉందని, సమాచారం మేరకు బాల్య వివాహం చేయవద్దని తల్లి తండ్రులకు అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ తహసీల్దార్ కౌశిక, ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ.. బాలికల తల్లితండ్రులు బాల్య వివాహాలు జరిపితే వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని, బాలికలకు బాల్య వివాహాలు చేస్తే ప్రభుత్వం అందించే పథకాలకు అనర్హులని, బాలికలకు భవిష్యత్తులో ఆరోగ్య పరమైన సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నరెడ్డి, ఎంపీపీ శారదా, సర్పంచ్ అంజలి, ఎంపీవో తిరుపతి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ఆర్టీసీ

నవతెలంగాణ-జుక్కల్



ఆర్టీసీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మం డలంలోని నాగల్‌గావ్ గ్రామంలో ప్రజల వద్దకు ఆర్టీసీ అనే కార్యక్రమాన్ని ఆర్టీసీ అధికారులు శనివారం చేపట్టారు. సర్పంచ్ కపిల్ పటేల్, జుక్కల్ మాజీ విండో చైర్మెన్ రాజు పటేల్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు ఆర్టీసీ అందిస్తున్న సేవలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాగల్‌గావ్ సర్పంచ్ కపిల్ పటేల్ మాట్లాడుతూ.. మాలేగాం నైట్ హల్ట్ బస్సు నడపాలని కోరారు. కార్యక్రమంలో నాగల్‌గావ్ ఉప సర్పంచ్ రవీందర్, పడంపల్లి వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల కేంద్రంలోని సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెలే హన్మంత్ షిండే ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఉదయం బసవేశ్వర చౌక్ నుంచి గిరిజనులు తమ సాంప్రదాయ దుస్తులు ధరించి భారీ ర్యాలీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆటపాటలతో ర్యాలీగా సమావేశ మందిరానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే షిండే గిరిజనులతో నృత్యం చేసి వారికి ఆనందపరిచారు. అనంతరం అడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రెయిని కలెక్టర్ శివేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. సేవాలాల్ యువకులకు రోల్ మాడల్ అని తెలిపారు. ఎమ్మెలే హన్మంత్ షిండే మాట్లాడుతూ.. సేవాలాల్ ఆశీర్వాదం తోనే తెలంగాణ ఏర్పడిందని, యువతను సన్మార్గంలో నడిపేందుకు కృషి చేశారని వివరించారు. హైదరాబాద్‌లో వంద కోట్లు కేటాయించి గిరిజన భవన్ నిర్మాణం కోరకు మంజూరు చేసిందని, గిరిజన పంచాయతీ ఏర్పాటు చేసి సర్పంచులుగా రాజకీయంలో ఎదుగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రాములు, ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో యాదగిరి, గిరిజన సంఘం మండలాధ్యక్షుడు జాదవ్‌రాజు, వివిధ మండలాల సర్పంచులు, జడ్పీటీసీలు, గిరిజన నాయకులు జాదవ్ నామ్‌దేవ్, మైబాపూర్ శంకర్, అధికారులు, నాయకులు తగితరులు పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

శక్కర్‌నగర్‌లో బోర్ వేయించిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్

నవతెలంగాణ-బోధన్



బోరు వేయిస్తున్న ఫ్లోర్ లీడర్

వేసవికాలం సమీపి స్తుండడంతో బోధన్ పట్ట ణంలోని శక్కర్‌నగర్‌లో గల కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో శక్కర్‌నగర్ మూడో వార్డులో కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ శనివారం బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు అధికం కావడం జరుగుతుందని, రాబోయే వేసవి కాలన్ని దృష్టిలో పెట్టుకొని కాలనీవాసులకు తాగునీటి ఇబ్బంది తీర్చడానికి మరో బోరు అవసరమని ఎమ్మెల్యే షకీల్ అమీర్‌ను కోరగా.. ఆయన తక్షణమే స్పందించి బోరు వేయడానికి ఆదేశించారని ఆయనకు కాలనీవాసుల తరపున కృతజ్ఞతలు తెలిపినట్టు రాధాకృష్ణ పేర్కొన్నారు.

ప్రతినెల ఐదుగురిని హజ్ యాత్రకు పంపిస్తా

- రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది మమ్మద్ మోహిన్ అహ్మద్ ఖాద్రి

నవతెలంగాణ-లింగంపేట్

ముస్లింల పవిత్రమైన హజ్ యాత్రకు ప్రతినెల ఐదుగురు చొప్పున హజ్ యాత్రకు పంపిస్తానని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది, భారీ నీటిపారుదల శాఖ కౌన్సిలింగ్ మెంబర్ ఖాదర్ అన్నారు. శనివారం సొంత డబ్బులతో నిర్మాణం చేపట్టిన మదర్సా భవనాన్ని ఆయన ప్రారంభించారు. మండల కేంద్రంలోని మొదటి నూతన భవనం తన సొంత నిధులు రూ.16లక్షల వ్యయంతో అత్యాధుని హంగులతో నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా రాజకీయాలకు అతీతంగా ఉండాలని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతానని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని సూచించారు. హజ్ యాత్రకు వెళ్లిన వారిలో మార్పు రావాలని ఆయన అన్నారు. బస్టాండ్ ప్రాంతంలోని కొత్త మసీదు మైనార్టీల నమాజ్ కొరకు సదుపాయాలు సొంత డబ్బులతో చేశామన్నారు. అనంతరం మైనార్టీ కమిటీ సభ్యులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది మొహిన్ అహ్మద్ ఖాదరిని సన్మానించారు. కార్యక్రమంలో మదర్సా నిర్వాహకులు హబుల్ హసన్ రిజ్వి, అబ్దుల్ ఖదీర్, అధ్యక్షులు ఫారుక్ సర్దార్ ఖాన్, నజీర్ హుస్సేన్ నహీం, పతియోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కుక్కలు, కోతుల నుంచి ప్రజలను కాపాడండి

- ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందచేసిన మున్సిపల్ కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని వార్డులలో వీధి కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉందని, ప్రజలను వాటి బారి నుంచి కాపాడాలని కోరుతూ ఎల్లారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ నాయక్‌కు స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు వినతిపత్రం శనివారం సమర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. వార్డులలో నివసిస్తున్న ప్రజలు, చిన్నపిల్లలు రోడ్డుపై వెళ్ళాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. అలాగే పెద్దలు కూడా నిత్యావసర సరుకులతో బైక్‌పైన రావాలంటే కోతులు కుక్కలు ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తాయోనని భయపడుతున్నారన్నారు. చిన్నపిల్లల్ని ఒంటరిగా స్కూల్‌కు గానీ, బయటకి పంపాలంటే కుక్కల, కోతుల బెడద ఉండడం వల్ల తల్లిదండ్రులు పిల్లల్ని బయటకి పంపలేకపోతున్నారని వాపోయారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఎర్రమన్ను కుచ్చ, ఇంద్రనగర్, గాంధీనగర్, పెద్ద మజీద్, బీసీ కాలనీ, నీలకంఠేశ్వర ఆలయం, రిక్షా కాలనీ, వైశ్య భవన్ సమీపంలో కుక్కల బెడద చాలా తీవ్రంగా ఉందని అన్నారు. వీలైనంత త్వరగా ఆర్డీవో స్పందించి వీటిపైన తగు చర్యలు తీసుకొని వార్డులో ఉన్న ప్రజలకు వీటి నుంచి విముక్తి కలిగించాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పద్మ శ్రీకాంత్, నీలకంఠం, ననుగొండ భూదేవి శ్రీనివాస్, గాదె విజయలక్ష్మి తిరుపతి, సంగని బాలమణి పోచయ్య, మంచిర్యాల మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కొలనుపాక దేవాలయానికి పాదయాత్ర ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గుడిమేట్ గ్రామంలోని మహాదేవుని గుట్ట దేవస్థానం నుంచి స్వాములు, శివభక్తులు నల్గొండ జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక దేవస్థానానికి పాదయాత్రను శనివారం ప్రారంభించారు. ఈ పాదయాత్రను బీఆర్‌యస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ తానాజీ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, ఎంపీటీసీ పత్తి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు ముస్తఫా, బీఆర్‌యస్ మండలాధ్యక్షులు శివాజీ రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు జువ్వాడి వినయ్, తూర్పు సంతోష్, స్వాములు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవం



- తల్లీబిడ్డా సురక్షితం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని చద్మల్ తండాకు చెందిన సాగారి గర్భిణీ పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా.. సిబ్బంది వచ్చి గర్భిణీని అంబులెన్స్‌లో గాంధారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవమైంది. కాగా తల్లీబిడ్డా సురక్షితంగా ఉన్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డలను ఆస్పత్రిలో చేర్పించారు. గర్భిణీ కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఎంటీ కృష్ణస్వామి, పైలట్ సంజీవ్, ఆరోగ్య కార్యకర్త పాల్గొన్నారు.

మోడీ అవినీతి, అరాచక పాలనపై పోరాటం చేస్తున్నది కేసీఆర్ ఒక్కరే

- హిండేన్ బర్గ్ రీసెర్చ్ అదానీ భాగోతం బయటపెట్టింది
- మోడీ సచ్చీలుడైతే అదానీపై సీబీఐ,ఈడీ విచారణ జరపాలి
- బీబీసీపై ఐటీ దాడులు దుర్మార్గం
- బీజేపీ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఫైర్
- బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

నవతెలంగాణ-వేల్పూర్

దేశంలో మోడీ అవినీతి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కేసీఆర్ ఒక్కరే పోరాటం చేస్తున్నారని మనమంతా అండగా నిలవాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనకు ఆకర్షితులై బాల్కొండ నియోజకవర్గంలోని బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీలకు చెందిన సుమారు 500 మంది రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. వేల కోట్ల ఎల్ఐసి ప్రీమియం డబ్బులను కూడా పక్కదోవ పట్టించిన ఘనత మోడీది అని అన్నారు. తన మిత్రుడు అదానీ కేవలం 8 ఏళ్లలో 45 వేల కోట్ల నుండి 11లక్షల కోట్లకు పడగలెత్తాని, ఆ డబ్బంతా ఎక్కడి నుండి వచ్చిందని ప్రశ్నించారు. హిండేన్ బర్గ్ రీసెర్చ్ సంస్థ మోడీ దోస్త్ అవినీతిని బయటపెట్టిందని అన్నారు. ఎల్‌ఐసి సంస్థనే అదానీ వల్ల 40వేల కోట్లు నష్ట పోయిందని తెలిపారు. ప్రధాని మోది సచ్చీలుడైతే అదానీపై సీబీఐ, ఈడి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత జైలుకు వెళ్తుందని బీజేపీ ఎంపీ ఎలా డిసైడ్ చేస్తాడని నిలదీశారు. రుణమాఫీ, 5జి స్పెక్ట్రం లాంటి రెండు కేసుల్లోనే మోడీ, అమిత్ షా దాదాపు 22లక్షల కోట్ల అవినీతి చేశారని అన్నారు. వారి అవినీతిని ప్రశ్నిస్తున్న కేసిఆర్ కుటుంబంపై పడ్డారని అన్నారు.

ఎంపి అరవింద్ వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి..

బాల్కొండలో 10 వేల మందికి 40కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందించానని తెలిపారు. ఎంపి అరవింద్‌కు దమ్ముంటే ప్రధాన మంత్రి సహాయ నిధి కింద నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. ఎంపి గ్రామాల్లో పర్యటించే ముందు ఆ ఊరికి ఏమి ఇచ్చాడో, కేంద్రం నుంచి తెచ్చిన నిధులతో ఏమీ అభివృద్ధి చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు తెస్తానని బాండ్ రాసిచ్చి గెలిచి రైతులను మోసం చేసిన అర్వింద్, ఇపుడు మళ్లీ గెలిపిస్తే పసుపు పరిశ్రమ తెస్తానని సిగ్గులేకుండా చెప్తున్నాడని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వస్తే అన్ని ఇస్తామని చెప్తున్న ఎంపీ ముందుగా తెలంగాణలో ప్రస్తుతం అమలవుతున్న పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయించాలని డిమాండ్ చేశారు. ఎనిమిదేళ్ళలో బాల్కొండ నియోజక వర్గంలో 100 కోట్ల తో రోడ్లు నిర్మించానని తెలిపారు. బీటీ రోడ్లు, మెయిన్ రోడ్లు, చెక్ డ్యాంలు, హెల్త్ సబ్ సెంటర్, గ్రామ పంచాయతీ భవనాలు, కుల సంఘాల భవనాలు, 50పైగా గుడులు నిర్మించుకున్నమని తెలిపారు. ఎండాకాలంలో కూడా నవాబ్ లిఫ్ట్, చౌట్పల్లి హన్మంత రెడ్డి లిఫ్ట్‌లను నడిపిస్తూ చెరువులను నింపుకుంటున్నామని అన్నారు. అభివృద్ధిపై గ్రామాల్లో చర్చ జరగాలని కోరారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న పలువురు

వరద కాలువలో పడి ఒకరు మృతి



నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని పాలెం గ్రామానికి చెందిన వ్యక్తి వరద కాలువలోని మోటర్ మరమ్మత్తులు చేస్తుండగా కాలువలో పడి మృతి చెందాడు. ఎస్సై ముత్యం రాజు వివరాల ప్రకారం.. ట్రాక్టర్ డ్రైవర్ అయిన బోగిడి సుమన్ (38) తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఓ బోరు మెకానిక్ వరద కాలువలోని మోటర్ మరమ్మత్తుల కోసం తీసుకువెళ్లాడు. వరద కాలువలోని మోటర్‌ను బయటకు తీసే ప్రయత్నంలో రెండు సార్లు ప్రయత్నించి మూడోసారి నీటిలోని మోటారు బయటకు తీయడానికి ప్రయత్నించకుండా అందులోనే చిక్కుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విహారయాత్రకు లిల్లీపుట్ విద్యార్థులు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాల విద్యార్థులు 150 మందిని శనివారం యాజమాన్యం విహారయాత్రకు తీసుకువెళ్లారు. ఇందులో భాగంగా సుభాష్ గార్డెన్‌లో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్యంగా రేణి డాన్స్, స్విమ్మింగ్ పూల్ వివిధ రకాల ఆట వస్తువులతో ఆటలు పాటలతో డ్యాన్సులు చేసి ఎంతో సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండ్ రామకృష్ణ మాట్లాడుతూ విహారయాత్ర వలన విద్యార్థులు మానసిక సామర్థ్యాన్ని పెంపొందించవచ్చన్నారు. వారి మానసిక ఒత్తిడిని కూడా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ యాత్రలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లీనరీలో పాల్గొన్న కాంగ్రెస్ ముఖ్య నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, రాయ్‌పూర్ నగరంలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, బాన్సువాడ ఇంచార్జ్ కాసుల బాలరాజ్, పిసిసి డెలిగేట్ గంగా శంకర్, నిజామాబాద్ మాజీ బీసీ సెల్ అధ్యక్షులు శేఖర్ గౌడ్, పిసిసి డెలికేట్ క్యాతం గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లీ బిడ్డ అదృశ్యం



నవతెలంగాణ-రామారెడ్డి

బిడ్డతో కలిసి తల్లీ అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోకుల్ తాండకు చెందిన పీపావత్ రజిత ఇంట్లో గొడవపడి, ఆరు నెలల బిడ్డతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా దొరకకపోవడంతో రజిత మామ కేతావత్ రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అనిల్ తెలిపారు.

దేశీదారు రవాణా చేస్తున్న వ్యక్తికి రూ.లక్ష జరిమానా

నవతెలంగాణ-బిచ్కుంద

మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు బాటిల్‌లను తీసుకువస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకొని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేసి రూ.లక్ష జరిమానా విధించారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం ద్వారా ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. డోంగ్లి మండలం మదన్‌హిప్పర్గ గ్రామానికి చెందిన ముకుందే సంతోష్ గతంలో మహారాష్ట్ర నుంచి దేశీదారు బాటిళ్లను తీసుకువచ్చి గ్రామంలో విక్రయిస్తుండగా గత మే నెలలో పట్టుకొని మొదటిసారి తప్పుగా తహసీల్దార్ అండ్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేసి తన ప్రవర్తనను మార్చుకోవాలని హెచ్చరించి వదిలేశారు. అతనిలో మార్పు రాకపోగా తన ద్విచక్ర వాహనంపై మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకొస్తుండగా పట్టుకొని దేశీదారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేసి రూ.లక్ష జరిమానా విధించారు. లక్ష రూపాయల పెనాల్టీని చలాన్ రూపంలో ప్రభుత్వానికి చెల్లించినట్టు తెలిపారు. ఎవరైనా మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు, అక్రమ మద్యం రవాణా చేసిన విక్రయం చేసిన వారికి పెనాల్టీతోపాటు జైలుకు పంపనున్నట్టు సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ అభిషేక్, హెడ్ కానిస్టేబుల్ ఎల్లయ్య, పెంటయ్య, కానిస్టేబుల్ నవీన్‌రెడ్డి, శ్రీధర్, స్వరూప, రేఖ, ప్రేమలత, అనిత, వనిత ఉన్నారు.

మతిస్థిమితం లేని పిట్లం వాసి మృతి

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రానికి చెందిన ఈశ్వర్ (మతిస్థిమితం లేని) వ్యక్తి శనివారం ఉదయం రాష్ట్ర రాజధాని స్వచ్ఛంద సేవా సంస్థ (డిసబుల్ హోమ్)లో మృతి చెందినట్టు మాజీ ఎంపీపీ రజినీకాంత్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. గతంలో మండల కేంద్రంలో మతిస్థిమితం లేక తిరుగుతూ ఉండే ఈశ్వర్‌కు 2015లో ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టగా ఆ ప్రమాదంలో నడుము భాగం దెబ్బతినడంతో నడవలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతుండగా 2016లో హైదరాబాద్‌లోని ఓ స్వచ్ఛంద సంస్థకు తరలించారు. వైద్యం చేయించగా అతను సాధారణ స్థితికి చేరుకున్నాడు. ఈశ్వర్ స్వచ్ఛంద సంస్థలో అందరితో కలిసి మెలిసి తిరుగుతుండేవాడు. కాగా ఆయన మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కామారెడ్డి విద్యార్థి విభాగం అధ్యక్షులు సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోజు రోజుకు మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రీతి ఆత్మహత్యయత్నానికి కారణమైన సైఫ్ ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏబీవీపీ అధ్యక్షులు అజయ్, ఉపాధ్యక్షులు నిశాంత్, నాయకులు యోగి, బన్నీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో ఉపాధి హామీ ప్రజా వేదిక

నవతెలంగాణ-మద్నూర్

మండలంలో గత మూడు సంవత్సరాల కాలంగా చేపట్టిన ఉపాధి హామీ పనులపై మండల స్థాయి ప్రజావేదికను మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీఏ పీడీ సాయన్న హాజరయ్యారు. గ్రామపంచాయతీల వారీగా చేపట్టిన ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాగ్మారే లక్ష్మీబాయి, ఎంపీడీవో గౌడ్, ఇతర అధికారులు, మండల ప్రోగ్రాం అధికారి పద్మ, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని తలమడ్ల గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు సుమారు రూ.35లక్షలతో ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సహకారంతో సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించినట్టు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బిక్కాజి బల్వంతరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజు, బాల్‌రెడ్డి, కృష్టారెడ్డి, లింగం, శ్రీను, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పలువురు

మెడికల్ విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

- ఎన్ఎస్‌యుఐ, ఏఐఎస్ఎఫ్
- విద్యార్థి సంఘాల ఆందోళన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న దాసరి హర్ష (22) మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని శనివారం ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ఎదుట ఆందోళన చేశారు. ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్, ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో విద్యార్థి మృతి పట్ల తమకు అనుమానాలు ఉన్నాయని, దీన్ని ఆత్మహత్య లాగా కాకుండా వేరే కోణంలో దర్యాప్తు చేస్తే నిజాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ చే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల్లోని వసతి గృహాల్లో కనీసం సీసీ కెమెరాలు కూడా అందుబాటులో లేవని, కాబట్టి తక్షణమే వసతి గృహాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని వారు కోరారు. మొన్న వరంగల్ లో ప్రీతి ఆత్మహత్యకు యత్నించడం ఈరోజు నిజామాబాదులో హర్ష అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఇలా రోజుకో మెడికల్ విద్యార్థి బాధితులవడం చూస్తుంటే అసలు ప్రభుత్వానికి మెడికల్ కళాశాల పర్యవేక్షణ పట్ల చిత్తశుద్ధి ఉందా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకుడు సయ్యద్ అష్రఫ్, ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అంజలి, నగర నాయకులు నవిన్, శిరీష పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

విద్యుత్ సంస్థలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని (టిఎస్పీఈజెఏసి) తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ నిజామాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో రెండవ రోజు శనివారం విద్యుత్ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి పవర్ హౌస్ కాంపౌండ్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు బి.రఘునందన్ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సి అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 1999 నుండి 2004 వరకు పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపిఎఫ్ పెన్షన్ సదుపాయం కల్పించాలని, ఆర్టిసన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని డివిజన్ ఆఫీసులలో మేనేజ్మెంట్ మొండి వైఖరికి వ్యతిరేకంగా నిరసనలను తెలియజేస్తున్నామని, విద్యుత్ ఉద్యోగులకు రావలసిన పిఆర్సి గత సంవత్సరం (2022 ఎప్రిల్ 1) నుంచి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, ఉద్యోగులు సమస్యలు పరిష్కరించే వరకు దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందుకు ఉద్యోగులు నిరసన కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ ఇంజనీర్స్ నిజామాబాద్ ఆర్.బాలేష్ కుమార్, పూదారి గంగాధర్, గంగారాం నాయక్, సురేష్ కుమార్, రాజేందర్ రెడ్డి, రాజెంధర్, సునిత, ఉమరాణి పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుతో జీవాలకు ఆరోగ్యం



దోమకొండ : మందు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-దోమకొండ/ఎల్లారెడ్డి

నట్టల నివారణతో గొర్రెలకు, మేకలకు ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ శారదా, జెడ్పీటీసీ సభ్యుడు తీగల తీర్మాల్‌గౌడ్ అన్నారు. దోమకొండ మండల కేంద్రంలో శనివారం పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు సరఫరా చేసిందన్నారు. పెంపకం దారులు తమ గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు తాగించాలని కోరారు. గొర్రెల, మేకల పెంపకందారులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శారద, సర్పంచి నల్లవు అంజలి శ్రీనివాస్, పశు వైద్యాధికారి శివకుమార్, ఎల్ఎస్ఏ అయోధ్య, సిబ్బంది రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మండలంలోని సాతెల్లి, దవల్ మల్కాపల్లి, తిమ్మారెడ్డి గ్రామాల్లో గొర్ల, మేకలకు మత్తమాల పశువైద్యాధికారిణి అర్చనరెడ్డి ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో కలిపి 1825 గొర్రెలకు, 911 మేకలకు నులిపురుగుల నివారణ మందు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు సంగమేశ్వర్, రవీందర్, మహమ్మద్ అబ్దుల్ అలీ, ఇతర ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధిస్తాం

నవతెలంగాణ-తాడ్వాయి

పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నట్టు ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ తెలిపారు. శనివారం మండలంలోని కృష్ణాజివాడి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఇంటి వద్ద విద్యార్థులు చదువుకునేలా చూడాలని కోరారు. పరీక్షలు అయిపోయేంతవరకు టీవీలు చూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బాలకిషన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- హత్ సే హత్ జోడో ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం వర్ని మండలంలోని కునిపూర్, కునిపూర్ క్యాంప్, జలాల్‌పూర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రాగానే మందుగా రైతు రుణమాఫీ రూ.2లక్షలు, రైతుకు మద్దతు ధర రూ.2500, గ్యాస్ ధర రూ.500 చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఫోరం లీడర్ యలమంచిలి శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, డెలిగేట్ కూనీపూర్ రాజారెడ్డి, బంజా గంగారాం, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో పేరు నమోదు

నవతెలంగాణ-లింగంపేట్

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా మండలంలోని లింగంపల్లి, కుర్దు గ్రామంలో శనివారం ఆన్‌లైన్ ఈ కేవైసీ చేశారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ మిత్రలు మాట్లాడుతూ.. ఈకేవైసీ చేయించుకోవడం వల్ల ప్రజలు రూ.5లక్షల వరకు ఉచిత చికిత్స తీసుకోవచ్చునని తెలిపారు. సర్పంచ్ బండి రాజయ్య, ఉప సర్పంచ్ రవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ మిత్రలు అనిల్, సాయిబాబా, లక్ష్మారెడ్డి, సందీప్, మహేష్ పాల్గొన్నారు.

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించండి

- ఎంపీఓ అబ్బగౌడ్

నవతెలంగాణ-నిజాంసాగర్

సకాలంలో ఇంటి పన్నులను చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని మండల పంచాయితీ అధికారి అబ్బాగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని గాలిపూర్ గ్రామంలో ఇంటిపన్నులు వసూలు చేసేందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వందశాతం ఇంటి పన్నులు వసూలు చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ అబ్బాగౌడ్, గాలిపూరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఇతర జీపీల పంచాయతీ కార్యదర్శులు సాయి ప్రణీత్, ప్రసాద్, గంగారం, శిరీష పాల్గొన్నారు.



స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు

ప్లీనరీలో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయి పూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డితో పాటు జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.